క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన

తర్లుపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూలక్ష్మి అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై వివిధ శాఖల అధికారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్ సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. సమాచార హక్కు చట్టం అర్జీదారులకు 30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని సూచించారు. 30 రోజుల్లోపు సమాచారం ఇవ్వకపోతే అర్జీదారులు అప్పీల్‌కు వెళ్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఈఓపీఆర్‌డీ సుకుమార్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిపై యువత దృష్టి సారించాలి


స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు

మార్కాపురం టౌన్: సమాజాభివృద్ధిపై యువత దృష్టి సారించాలని డాక్టర్ సామ్యేల్ జార్జి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యువతలో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడా సామగ్రి అందజేస్తున్న దాతలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి గడ్డం సుబ్బరంగయ్య, సరోజినీదేవి దంపతులు క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు నివ్వడం అభినందనీయమన్నారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా క్రీడా పరికరాలు అందజేసిన దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ పెరుమారెడ్డి రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీయొద్దు


నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

గిద్దలూరురూరల్: ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో వర్కర్ల యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెడుతుండటంతో ఆటో కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలు కొనుక్కునేందుకు ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రఫీ, హుస్సేన్, నాగేశ్వరరావు, నరేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ

కొనకనమిట్ల: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించి లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ పేర్కొన్నారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై మంగళవారం కొనకనమిట్లలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు పంటల సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారం ఎరువులు వినియోగిస్తే పెట్టుబడి భారం తగ్గుతుందని చెప్పారు. సమావేశంలో వ్యవసాయాధికారి కె.ప్రకాష్‌రావు, ఏఈఓ రవి కాంత్, వీఏఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు బరువై.. నీటి చుక్క కరువై!


మార్కాపురం చెరువు పంట కాలువలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం


చిల్లచెట్లతో నిండిన రాయవరం చెరువు


చుక్కనీరు లేని మార్కాపురం చెరువు

- మార్కాపురం మండలంలో చుక్క నీరులేని చెరువులు
- శిథిలావస్థలో తూముల పట్టర్లు.. పంట కాలువల్లో చిల్లచెట్లు
- అడపాదడపా వర్షాలు కురిసినా ఫలితం శూన్యం
- ప్రశ్నార్థకంగా మారిన ఆయకట్టు సాగు

మార్కాపురం:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా మార్కాపురం మండలంలోని పలు చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు చెరువు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో చిల్ల చెట్లు, పూడికతో నిండిపోయాయి. ఒక వేళ వర్షం కురిసి చెరువులకు కాస్తోకూస్తో నీరు వచ్చినా కాలువల ద్వారా పొలాలకు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు చెరువుల ఆయకట్టు భూముల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. నేల పదునయ్యే వర్షం కురవకపోవడంతో సజ్జ, కంది, ఆముదం, మిర్చి, కొర్ర తదితర ఖరీఫ్ పంటలు సాగు చేయలేదు. బోర్ల కింద అక్కడక్కడా పత్తి సాగు చేశారు. కొంత మంది రైతులు సజ్జ, కంది, జొన్న వేసినా విత్తనాలు గిడసబారి మొలక రాలేదు. గత ఏడాది చెరువులు, చెరువు కాలువలను మరమ్మతులు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే నిండినట్లు అనిపించినా రోజుల వ్యవధిలోనే నీరు ఆవిరవుతోంది. మార్కాపురం ప్రాంతంలో వర్షాధారం, చెరువు నీటి ద్వారానే పంటలు సాగవుతున్నాయి. చెరువుల్లో నీరు లేకపోవడంతో రైతులు ఇంకా పంటల సాగు చేపట్టలేదు.

కళ తప్పిన చెరువులు

మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 49 చెరువులు ఉండగా అందులో మార్కాపురం మండలంలో 27, తర్లుపాడులో 8, కొనకనమిట్లలో 9, పొదిలిలో 5 ఉన్నాయి. జూన్ మొదటివారంలోనే రుతుపవనాలు వచ్చి అడపాదడపా వానలు పడుతున్నా చెరువుల్లో చుక్క నీరు లేదు. మార్కాపురం చెరువు పూడికతో నిండి పల్లెంలా మారింది. గత ఏడాది కూడా చెరువు కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. మార్కాపురం చెరువు కింద అధికారికంగా సుమారు 1500 ఎకరాలు, అనధికారికంగా మరో వెయ్యి ఎకరాల భూమి సాగులో ఉంది. అయితే అటు నీరు లేకపోవడం, ఇటు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో కొద్దిపాటి నీరు కూడా నిరుపయోగంగా మారింది. వేములకోట చెరువు కింద 600 ఎకరాలు, తిప్పాయిపాలెం రిజర్వాయర్ కింద 1200 ఎకరాలు, నాగులవరం చెరువుకింద 200 ఎకరాలు, గజ్జలకొండ చెరువుకింద 350 ఎకరాలు, రాయవరం చెరువు కింద 500 ఎకరాలు, బోడపాడు బంధంబావి క్రింద 170 ఎకరాలు, భూపతిపల్లె చెరువు కింద 108 ఎకరాలు, కోలభీముపాడు చెరువు కింద 108 ఎకరాలు, కొంగల వాగు కింద 114 ఎకరాలు, గొట్టిపడియ చెరువు కింద 179 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఆయా చెరువుల కట్టలు, తూములు, కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం కళ తప్పాయి. చెరువుల అంతర్భాగంతోపాటు ఆయకట్టు భూములు సైతం చిల్లకంపతో నిండిపోయాయి. పాలకులు ఇప్పటికైనా స్పందించి చెరువులకు మరమ్మతులు చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


చిల్లచెట్లు, గడ్డితో నిండిన మార్కాపురం చెరువు ఆయకట్టు భూములు

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- ఎంపీపీ భూలక్ష్మి సూచన
- వాడీవేడిగా తర్లుపాడు మండల సర్వసభ్య సమావేశం
- అధికారుల తీరును ఎండగట్టిన ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌జీఎస్ అధికారుల తీరును సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కేతగుడిపి సర్పంచ్ డి.పెద్ద మస్తాన్ నిలదీశారు. ఒక్కో కూలీ వద్ద 300 రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, స్థానికంగా నివసించని వ్యక్తులకు కూడా హాజరు వేస్తూ డబ్బు దండుకుంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులే కింది స్థాయి సిబ్బందితో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని విరుచుకుపడ్డారు. అనంతరం మీర్జపేట ఎంపీటీసీ సభ్యురాలు పార్వతీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. వెలుగు సిబ్బంది పనితీరును సభ దృష్టికి తెచ్చారు. పొదుపు గ్రూప్ సభ్యులకు రుణం ఇప్పించకుండా తమ చుట్టూ తిప్పుకొంటున్నారని, ఏపీఎం అందుబాటులో ఉండటం లేదని సభదృష్టికి తెచ్చారు. ఎంపీటీసీ మాట్లాడుతుండగా పలువురు సర్పంచ్‌లు ఆమెతో జత కలిసి వెలుగు ఏపీఎం పనితీరుపై ఆగ్రహించారు. గడిచిన ఏడాది కాలంలో మండలంలో ఎంత మంది పొదుపు గ్రూపు సభ్యులకు రుణం ఇప్పించారో చెప్పాలని నిలదీశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలంటూ పంచాయతీ సెక్రటరీలు తమపై ఒత్తిడి చేస్తున్నారని, ఇప్పటికే ఖర్చు చేసిన లక్షల రూపాయలకు బిల్లులు చెల్లిస్తే గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ భూలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని, పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఎంపీపీ ఆదేశించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఈఓపీఆర్డీ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీ చేస్తే సహించేది లేదు

- సబ్ కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరిక


పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: పెట్రోల్ బంకుల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటానని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక కళాశాల రోడ్డులోని ఓ పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. ఇంధన నాణ్యతను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. పెట్రోల్ బంకుల్లో కల్తీ చేయకుండా, నాణ్యమైన ఇంధనం విక్రయించాలని యజమానులను ఆదేశించారు.


స్థల వివాదంలో దాడి

- మహిళకు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్రవంతి

పొదిలి రూరల్: కొద్దిపాటి స్థలం విషయంలో తలెత్తిన వివాదంలో అధికార టీడీపీ మూకలు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి పొదిలి మండలంలోని మూగ చింతలలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకాశం.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరాలు నల్లబోతుల స్రవంతి ఉన్న కొద్దిపాటి స్థల వివాదంలో అధికార పార్టీ పచ్చమూకలు నల్లబోతుల నాగేశ్వరరావు, నల్లబోతుల చెంచురామయ్య, నల్లబోతుల ధనమ్మ, నల్లబోతుల కాశమ్మ ముకుమ్మడిగా కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన స్రవంతిని బంధువులు పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుండ్లకమ్మ పరవళ్లు


రామన్నకతువ నుంచి దిగువకు ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వరద నీరు


నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని నీటి గుండంలోకి గుండ్లకమ్మ వరద నీరు భారీగా చేరుతుండటంతో ఆలయానికి వేళ్లే మార్గం నీటి తుంపర్లతో కమ్ముకుపోయింది. రామన్నకతువతోపాటు చినగానిపల్లెలో రంగయ్య నాయుడు చెరువు, ఆకవీడులోని ఎర్రదిన్నె చెరువు, కంభం మండలం తురిమెళ్ల పెద్ద చెరువులకు గుండ్లకమ్మ వరద నీరు చేరుతోంది.

8 కేజీల గంజాయి పట్టివేత

- ఆరుగురు నిందితుల అరెస్టు
- విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ


నిందితులతో పోలీసు అధికారులు

పొదిలి: గంజాయి విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8.065 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమనతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఈ కేసులో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన కల్కి సాయికుమార్‌రెడ్డి, బీహార్ రాష్ట్రానికి చెందిన బిక్రమ్ కుమార్, సుజిత్ కుమార్, పవన్‌కుమార్, దీపు కుమార్, కొమరోలు మండలం మోటు గ్రామానికి చెందిన కోలా బాబూరావులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సుజిత్‌కుమార్ అనే వ్యక్తి పోతవరం గ్రామానికి చెందిన కోటి అనే రైతు ఆవుల షెడ్‌లో పనిచేస్తున్నాడు. ఆ సమయంలో అతనికి సాయికుమార్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. తనకు గంజాయి అవసరమని, అందించాలని సుజిత్‌కుమార్‌కు చెప్పాడు. దీంతో సుజితకుమార్ పక్క గ్రామంలో పనిచేస్తున్న బిక్రం కుమార్‌కు ఫోన్ చేసి గంజాయి తెప్పించాలని కోరాడు. ఇలా వచ్చిన గంజాయిని సాయికుమార్‌రెడ్డి, కోలా బాబూరావులు స్థానికంగా ఏడాదిగా అమ్మకాలు చేస్తున్నారు. సెలవులు, పండగలు, ఇతర శుభకార్యాలు అధికంగా ఉన్నందున గంజాయి అధిక మొత్తంలో అవసరం అవుతుందని సుజిత్‌కుమార్‌తో చెప్పారు. ఒరిస్సాలో గంజాయి కొనుగోలు చేసిన బిక్రం కుమార్ ఇక్కడ పరిస్థితులు బాగా లేవని, తాను ఒక్కడినే అంత మొత్తంలో సరుకు తీసుకరాలేనని తన మిత్రులైన సుజిత్‌కుమార్, దీపు కుమార్, పవన్‌కుమార్‌లు కూడా తలా కొంత మొత్తంలో గంజాయి తీసుకువస్తున్నారని చెప్పాడు. దీంతో సాయికుమార్‌రెడ్డి, బాబూరావులు ఎస్టీ కాలనీలోని చిన్నచెరువు ప్రాంతంలో సాయికుమార్ రెడ్డి ఇంటి వద్ద వీరు వేసి ఉన్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులకు అక్కడ కాపుకాశారు. వారంతా అక్కడికి చేరిన వెంటనే దాడులు చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8.065 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. దాడుల్లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, ఇన్‌చార్జి తహసీల్దార్ షాజిదా, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. గంజాయి సరఫరా దారులు, అమ్మకం దారులను అరెస్ట్ చేసేందుకు కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీసులను డీఎస్పీ లక్ష్మీ నారాయణ అభినందించారు.

పోలీసుల అదుపులో హత్యాయత్నం కేసు నిందితుడు!

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఓ వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డి హత్య కేసు విషయంలో సోమవారం మార్కాపురం కోర్టుకు హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో మార్కాపురం డిపోలో బస్సు ఎక్కాడు. అదే సమయంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన వెంగళరెడ్డి మరికొంత మంది కలిసి బాపిరెడ్డి కళ్లలో కారం చల్లి ఇనుపరాడ్డుతో కొట్టేందుకు ప్రయత్నించగా గట్టిగా అరిచి తప్పించుకున్నాడు. ఈ సంఘటనపై నమోదైన కేసులో వెంగళరెడ్డిని మార్కాపురం పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వారి మధ్య పాతకక్షలు, గొడవలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి!


గుడిమెట్ట వద్ద మృతి చెందిన వ్యక్తి

రాచర్ల: ఓ గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాల పక్కన శవమై పడి ఉన్నాడు. ఈ సంఘటన రాచర్ల మండలంలోని గుడిమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో 193వ మైలు రాయి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సాయంత్రం వేళ నంద్యాల నుంచి గుంటూరు వెళ్తున్న డోన్ ప్యాసింజర్ రైలు కింద పడి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై నలుపు రంగు ప్యాంట్, తెల్ల చొక్కా ఉన్నాయి. వయసు సుమారు 40 ఏళ్లు ఉండవచ్చని తెలుస్తోంది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మల్లె, జాజి తోటల పరిశీలన


పూలరైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన శాఖాధికారిణి శ్వేత

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మండలంలోని రావిపాడులో మల్లెతోటలకు చీడపీడలు, తెగుళ్ల దాటికి దిగుబడి తగ్గిపోతున్న నేపథ్యంలో సోమవారం 'పూలరైతు వాడిపోయి..!' అన్న శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉద్యానవన శాఖాధికారి డి.శ్వేత మంగళవారం రావిపాడులోని పూలతోటలను పరిశీలించారు. మల్లెతోటలో మిడ్జ్ ఈగ ఉధృతి ఎక్కువగా ఉందని, ఈగ లార్వా మొగ్గలోకి చేరడం వల్ల మొగ్గ గులాబీ రంగులోకి మారి ఎండిపోతుందన్నారు. దీని నివారణకు థియోమిథాక్సం 0.75 ఎంఎల్ లీటర్ నీటికి లేదా నోవలురాన్ 3 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. జాజి తోటలో నల్లి ప్రభావం ఎక్కువగా ఉందని నివారణకు స్పైరోమెసిఫెన్ 1 గ్రా లీ నీటికి లేదా డిఫెంథియరాన్ 1 గ్రా లీ.నీటికి లేదా ఫెనజాక్విన్ 1 ఎంఎల్ లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.